క్లుప్తంగా

సాయినాథ్ సంస్మరణ సభ


మాట్లాడుతున్న, పార్థసారథి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఐలు రాష్ట్ర కమిటీ, లా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైకోర్టు అడ్వకేట్ కే. సాయినాథ్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా సాయినాథ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.పార్థసారథి మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థపై ఎంతో నమ్మకంతో కష్టపడి పనిచేస్తున్న సాయినాథ్ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన చిరకాలం గుర్తుండి పోతారన్నారు. ఈ కార్యక్రమంలో ఐలు రాష్ట్ర నాయకులు రామచంద్రరెడ్డి, మందాడపు శ్రీనివాసరావు, శైలజ, వేణుగోపాల్, అబ్బగాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కవి సమ్మేళనం


ప్రముఖులను సన్మానించిన దైవజ్ఞశర్మ

చిక్కడపల్లి: దాశరథి కృష్ణమాచార్య నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడని సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ అన్నారు. పినాకిని యూత్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయ గానసభలో దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల నుంచి ఎంపిక చేసిన పలువురు ప్రముఖులకు దైవజ్ఞశర్మ సాహితీ పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దాశరథి తన సాహిత్యంలో తెలంగాణ అస్థిత్వాన్ని చాటి చెప్పారని కొనియాడారు. నిర్వహణ సంస్థ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు పర్యవేక్షణ చేసిన కార్యక్రమంలో ప్రముఖులు అంజయ్య, బి.నాగరత్నం, ఉమారాణి, విజయశ్రీ, సరోజ దేవి, ఎంఎస్కే షా, మార్కండేయులు, రాజుగంగాధర్‌రెడ్డి, ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ముషీరాబాద్: విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభు తెలిపారు. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్-1, బీబీఏ రిటైల్ ఆపరేషన్-1, బీసీఏ కంప్యూటర్ అప్లికేషన్స్-1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్-7, ఆంగ్లం -3, కామర్స్-3, డాటా సైన్స్‌లో-1, హిస్టరీ-1, మ్యాథమెటిక్స్-1, పొలిటికల్ సైన్స్-1, సంస్కృతం -1, స్టాటిస్టిక్స్-1, జువాలజీ-1, అరబిక్-1 తదితర విభాగాల్లో మొత్తం 25 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు పీజీలో కనీసం 55 శాతం మార్కులతో పాటు పీహెచ్‌డీ, ఎన్‌ఈటీ, సీఈటీ, ఎస్‌ఎల్‌ఈటీ ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని ఈ నెల 24వ తేదీలోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఫైర్ సేఫ్టీ కోర్సుకు..

కాచిగూడ: నేషనల్ సెంటర్ ఫర్ ఫైర్ అండ్ హెల్త్ సేఫ్టీ ఇంజినీరింగ్ కోర్సుల్లో శిక్షణ కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ అడప వెంకట్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ అభ్యర్థులు అర్హులని పూర్తి వివరాలకు 6302355872 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పురస్కారాల ఎంపికకు..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆల్ ది బెస్ట్ ఆర్ట్ అకాడమీ హైదరాబాద్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 15న హైదరాబాద్ నగరంలో ప్రదానం చేయనున్న ప్రైడ్ ఆఫ్ ఇండియా, ఐకాన్ ఆఫ్ ఇండియా -2025 జాతీయ స్థాయి పురస్కారాల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టార్ తెలిపారు. ఈ నెల 31లోపు తాము అందిస్తున్న సేవలు, ప్రతిభను తెలిపే సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రిక క్లిపింగ్ జిరాక్స్‌లతో పాటు 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలు జత చేసి పంపించాలని మరిన్ని వివరాలకు 9652347207 లో సంప్రదించాలన్నారు.

అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు

కాచిగూడ: హైదరాబాద్ మెట్రో వాటర్ అండ్ సివరేజ్ బోర్డు (జలమండలి) కార్మికులకు ఓటీ అలవెన్స్‌పై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని, గతంలో మాదిరిగానే అలవెన్స్ కొనసాగుతుందని జలమండలి కామ్‌ఘార్ యూనియన్ అధ్యక్షుడు ఎం.రాజిరెడ్డి తెలిపారు. ఎమర్జెన్సీ విభాగం కార్మికులు సెలవు దినాలు, 8 గంటలకు మించి అదనంగా పని చేస్తే ఓటీ అలవెన్స్ వస్తుందన్నారు.

బోనాల జాతరకు సర్వం సిద్ధం

ముస్తాబైన ఆలయాలు | ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు


విద్యుద్దీపాలతో ముస్తాబైన ఆలయం


అంబర్‌పేట మహాంకాళి ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు


ముషీరాబాద్‌లో భారీగా ఏర్పాటు చేసిన స్వాగత వేదికలు

అంబర్‌పేట: బోనాల వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఆదివారం(నేడు) అంబర్‌పేటలో బోనాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా బోనాల ఉత్సవాలు నిర్వహించుకునేందుకు ఆలయాలను ముస్తాబు చేశారు. అంబర్‌పేటలో ప్రధాన ఆలయం అయిన మహాంకాళి అమ్మవారి వద్ద బోనాల వేడుకలను నిర్వహించేందుకు అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులుబారులు తీరుతారు.

రంగం ప్రత్యేకం...

బోనాల వేడుకలను పురస్కరించుకుని అంబర్‌పేట మహాంకాళి ఆలయం వద్ద భవిష్యవాణి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రంగం కార్యక్రమంతో అమ్మవారి భక్తులకు భవిష్యవాణి వినిపిస్తారు. అమ్మవారి చల్లని దీవెనల కోసం భక్తులు క్యూ కడతారు. అనంతరం అమ్మవారి తొట్టెల ఊరేగింపులు, ఫలహారం బండి ఊరేగింపు వంటి వేడుకలను కనుల పండువగా నిర్వహిస్తారు.

ముషీరాబాద్‌లో

ముషీరాబాద్: బోనాల పండుగను పురస్కరించుకోని ముషీరాబాద్‌లోని అమ్మవారి ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. వంద సంవత్సరాల చరిత్రగల మహాంకాళీ అమ్మవారి దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. బాపూజీనగర్‌లోని నల్ల పోచమ్మ ఆలయాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం వద్ద క్యూ పద్ధతిని పాటించేందుకు బారికేడ్లను ఏర్పాటు చేశారు. ముషీరాబాద్ బీఆర్ఎస్ నాయకులు కార్తీక్‌యాదవ్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ చౌరాస్తా నుంచి భరత్‌నగర్ వరకు డిజిటల్ లైట్లతో స్వాగత వేదికలు, దేవతామూర్తుల ప్రతిమలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.

రత్నానగర్‌లో..

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్‌లోని ముత్యాలమ్మ, బంగారు మైసమ్మ ఆలయంలో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. శనివారం రత్నానగర్ సంక్షేమ సంఘం, బోనాల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎంబి. కిషోర్ కుమార్, ఉపాధ్యక్షుడు బి. రాము యాదవ్, ప్రధాన కార్యదర్శి పి. నర్సింగ్ రావు, సంయుక్త కార్యదర్శి టి. వీరయ్య గౌడ్, కోశాధికారి పాదం వెంకటేశ్ తదితరులు బోనాల వివరాలను వెల్లడించారు. ఆదివారం(నేడు) ఉదయం 6 గంటలకు అమ్మవారికి అభిషేకం, 7 గంటలకు ప్రత్యేక అలంకరణలో అమ్మవారికి విశేష పూజలు ఉంటాయన్నారు. 9 గంటల నుంచి భక్తులు అమ్మవారికి బోనాలు నైవేద్యంగా సమర్పిస్తారని చెప్పారు. అలాగే శివ సత్తులు, పోతురాజుల నృత్యాలతో తొట్టెల ఊరేగింపు ఉంటుందన్నారు.


బోనాలకు రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబైన ముషీరాబాద్ మహాంకాళి దేవాలయం


బోనాలకు ముస్తాబైన ముత్యాలమ్మ బంగారు మైసమ్మ ఆలయం

రిజర్వేషన్ అమలుకు వినతి


వినతిపత్రం ఇస్తున్న కమిటీ నేతలు

కవాడిగూడ: రాష్ట్రంలో బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక , విద్యా రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు సురేందర్, జై ప్రకాష్, ఇతర కమిటీ సభ్యులను బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీని అమలు చేయాలని కోరారు. ఇందుకోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని పేర్కొనడం అభినందనీయమన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించి బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, కమిషన్ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తప్పనిసరిగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎ.భాగయ్య, నరహరి, శ్రీహరి, రాంచందర్ , సుధాకర్,వాణి, యాదగిరి పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి


బహుమతులను అందజేస్తున్న ప్రొఫెసర్ విద్యాసాగర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివినప్పుడే ఉన్నత స్థానానికి చేరుకుంటారని ప్రొఫెసర్ విద్యాసాగర్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణ మండపంలో ఆరోర డిగ్రీ , పీజీ కళాశాల ఆధ్వర్యంలో పరిచయ్ పేరిట ఇండక్షన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ విద్యాసాగర్ మాట్లాడుతూ..ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే పట్టుదలతో చదవాలన్నారు. ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ... తల్లిదండ్రులతోపాటు గురువులను, పెద్దలను గౌరవించేవారికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుంన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభను కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అజయ్‌కుమార్, దుర్గేష్ శ్రీవాస్తవ, డాక్టర్ పద్మిని, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అని అజయ్ కుమార్ అన్నారు. సంజీవని ఎన్‌జీవో సొసైటీ, లయన్స్ క్లబ్ హైదరాబాద్, ఎలైట్ కాస్మో అసోసియేషన్ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని ఆరోరా కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని అజయ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తే ప్రాణం కాపాడిన వారవుతారన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి


మాట్లాడుతున్న వెంకట్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది బహుజన కులాల ప్రజలు ప్రభుత్వ స్థలాలో నివాసముంటున్న అర్హులైన నిరుపేద కుటుంబాలకు పట్టాలు మంజూరు చేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలు అగ్రకుల నిరుపేదలకు బహుజన కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేసి స్వయం ఉపాధిని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూర్య ప్రకాష్, సిద్దిరాములు, లత, శ్రీశైలం, సాయికృష్ణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం


కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న బస్తీవాసులు

చిక్కడపల్లి: సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ పేర్కొన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని నేతాజీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం, పలు సమస్యల పరిష్కారానికి కృషి చేసిన కార్పొరేటర్‌ను శనివారం బస్తీవాసులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వినయ్‌కుమార్, నవీన్‌కుమార్, శ్రీకాంత్, ఆనంద్ రావు, హన్మంతు, ప్రశాంత్ ఆనంద్‌యాదవ్, యాదగిరి, కుమర్ పాల్గొన్నారు.

ఆలయాల వద్ద ఎల్‌ఈడీ లైట్లు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని అమ్మవార్ల దేవాలయాల వద్ద ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైట్లను కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని అన్ని అమ్మవారి ఆలయాల వద్ద సుమారు 500 ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

కాచిగూడ: బీసీల న్యాయమైన సమస్యలను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 23, 24 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న హలో బీసీ..చలో ఢిల్లీ జాతీయ బీసీ సదస్సుల పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఢిల్లీలో జరిగే జాతీయ సదస్సుకు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి బీసీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో నందగోపాల్, ఉదయ్ నేత, మీనగ గోపి బోయ పాల్గొన్నారు.

బోనాలకు ఆహ్వానం..

అంబర్‌పేట: అంబర్‌పేట మహాంకాళి ఆలయంలో నిర్వహించనున్న బోనాల వేడుకలకు రావాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు ఆహ్వానపత్రం అందించారు.ఈ కార్యక్రమకంలో శంకర్‌గౌడ్, దుర్గాప్రసాద్ రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, రంగంపల్లి రాజు, కిషోర్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలర్చుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న కాచిగూడ ఎస్‌ఐ హెచ్.నరేష్

కాచిగూడ: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని అందరికి ఆదర్శంగా నిలవాలని కాచిగూడ ఎస్ఐ హెచ్.నరేష్ సూచించారు. శనివారం బర్కత్‌పురలోని శ్రీ చైతన్య స్కూల్‌లో జరిగిన ఇన్వెస్టిచర్ సెరిమనీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకున్నప్పుడే జీవితంలో ఉన్నతంగా రాణించగలుగుతారన్నారు. మంచి నాయకుడిగా ఎదగాలంటే నైతికత, క్రమశిక్షణ, ప్రజల పట్ల బాధ్యత అనేవి చాలా ముఖ్యమైన విలువలని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సమాజం పట్ల బాధ్యతను కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం మొహ్మద్ ఆలీ, ఆర్ఐ మల్లకార్జున నాయుడు, రాజేంద్రప్రసాద్, రుబీనా, రమేష్ పాల్గొన్నారు.

కోట శ్రీనివాసరావు విలక్షణ నటుడు



చిక్కడపల్లి: కోట శ్రీనివాసరావు విలక్షణ నటుడని ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహరావు అన్నారు. శనివారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభ నిర్వహణలో గుండవరపు హనుమంత రావు హాల్లో నిర్వహించిన కోట శ్రీనివాసరావు సంతాపసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోట ప్రతిభాశాలి అని, ఆయన నటించిన పాత్రకు న్యాయం చేసేవారన్నారు. నటుడు సుబ్బరాయశర్మ మాట్లాడుతూ.. కోట శ్రీనివాసరావు గొప్ప మనసున్న నటుడని తాను ఎంత ఎత్తుకు ఎదిగినా నాటక రంగాన్ని విస్మరించలేదని గుర్తుచేశారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు శ్రీరామమూర్తి, హనుమంతరావు, మాణిక్, రామసత్యనారాయణ, వీరశంకర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి

ముషీరాబాద్: అఖిల భారత యాదవ్ మహాసభ సీనియర్ నాయకులు రాధాకృష్ణయాదవ్‌పై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్‌యాదవ్, ఎడ్లహరి బాబుయాదవ్ డిమాండ్ చేశారు. శనివారం అఖిల భారత యాదవ మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాధాకృష్ణయాదవ్‌పై దాడి చేసిన వారు వెంటనే క్షమాపణలు చెప్పాలని లేనిపక్షంలో భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో శ్రీనివాస్‌యాదవ్, జగన్‌యాదవ్, జగదీష్‌యాదవ్, వేణుగోపాల్‌యాదవ్, యశ్వంత్‌రాజ్ యాదవ్, మురళీధర్‌యాదవ్ సతీష్‌యాదవ్ పాల్గొన్నారు.

27న యువ సమ్మేళనం

కాచిగూడ: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 27వ తేదీన తార్నాక ప్రెసిడెంట్ కన్వేషన్ హాల్లో యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ ఎస్.అబ్రహం తెలిపారు. ఈ సదస్సులో వ్యాపార రంగంలో మెళకువలపై యువతకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. సమ్మేళనంలో పాల్గొనే యువత ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని పూర్తి వివరాలకు 8885073555 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజవర్గం అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని నేతాజీనగర్‌లో గత 30 ఏళ్లుగా ఉన్న డ్రైనేజీ, తాగునీటి సరఫరా సమస్యలను పరిష్కరించినందుకు శనివారం బస్తీవాసులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలను కలిసి మెలసి జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఠాజైసింహ, ఎం.రాకేష్‌కుమార్, శ్రీకాంత్, ముఠానరేష్, ఎర్రంశ్రీనివాస్‌గుప్తా, పి.సత్యనారాయణ, రాజ్‌మోహన్, వెంకటేష్, దేవయ్య, యాదగిరి, ఆనంద్‌కుమార్, విఠల్, యాదగిరి పాల్గొన్నారు.

గీత కార్మికులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న వెంకటరమణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కల్లుగీత వృత్తిలో ఉపాధి అవకాశాలను మెరుగు పరిచి, ప్రమాదాలు నివారించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వృత్తిలో ఉపాధి ప్రమాదాల నివారణ అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 5 లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని వీరిని ప్రోత్సహించి, ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ప్రధాన కార్యదర్శి బెల్లం కొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కొంత మంది వ్యాపారులు కల్లు కల్తీ చేస్తున్నారనే నెపంతో కల్లుపై దుష్ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. కల్తీ జరగకుండా చర్యలు తీసుకోవాలే తప్ప దాని పేరుతో వృత్తిని దెబ్బ తీయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటనరసయ్య, గోవింద్, వెంకట మల్లయ్య, బూడిద గోపి, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థ కీలకమైంది


సమావేశంలో పాల్గొన్న ప్రొఫెసర్ నర్సింహారెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సమాజంలో న్యాయ వ్యవస్థ అత్యంత కీలకమైందని బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ సభ్యులు ప్రొఫెసర్ ఎ. నర్సింహారెడ్డి అన్నారు. సాధారణ ప్రజలకు సైతం న్యాయం దక్కాలంటే కోర్టు మెట్లు ఎక్కాల్సిందే అన్నారు.శనివారం డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ లా కళాశాలలో అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మూడు రోజుల పాటు న్యాయ వ్యవస్థ సవాళ్లు అనే అంశంపై సదస్సు జరిగింది. ముగింపు సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నర్సింహారెడ్డి మాట్లాడుతూ... ప్రపంచంలోనే భారత న్యాయ వ్యవస్థకు మంచి గుర్తింపు ప్రాధాన్యం ఉందన్నారు. భారత రాజ్యాంగ ప్రకారం నడుచుకునే ఈ న్యాయ వ్యవస్థ దేశంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ .వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎస్.రాంప్రసాద్, ప్రియ యాంగర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సృజనతదితరులు పాల్గొన్నారు.